క్లుప్తంగా

నిజాయతీ చాటుకున్న గంగపుత్రులు



భక్తురాలికి హ్యాండ్‌బ్యాగ్ అప్పగిస్తున్న గంగపుత్రులు

బాసర: భక్తురాలు పోగొట్టుకున్న హ్యాండ్‌బ్యాగ్‌ను గంగపుత్రులు ఆమెకు అప్పగించి తమ నిజాయతీ చాటుకున్నారు. నిజామాబాద్ జిల్లా రెంజల్ గ్రామానికి చెందిన భక్తురాలు హేమ సోమవారం శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనానికి వచ్చింది. గోదావరి పుష్కర ఘాట్ వద్ద హ్యాండ్‌బ్యాగ్ పోగొట్టుకుంది. రెండు సెల్‌ఫోన్లు, నగదు ఉన్న హ్యాండ్ బ్యాగు దొరికిన గంగపుత్రులు తిరిగి ఆ భక్తురాలికి అప్పగించారు. ఇటీవల గోదావరినదిలో దూకేందుకు యత్నించిన వృద్ధుడిని గంగపుత్రులు కాపాడి మానవత్వాన్ని చాటుకున్నారు.

డీజేలు పెడితే కేసులు



డీజే యజమానులతో మాట్లాడుతున్న డీఎస్పీ గంగారెడ్డి, పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్

నిర్మల్‌టౌన్: మతపరమైన ఊరేగింపుల్లో డీజేలు పెట్టవద్దని నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి పేర్కొన్నారు. పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం డీజే యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా డీజేలు పెడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డీజేలతో ప్రజలకు ఇబ్బందులు కలిగించొద్దన్నారు. పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

దస్తురాబాద్: దుర్గామాత ఉత్సవాలు, బతుకమ్మ పండుగలకు డీజేల వినియోగించొద్దని ఖానాపూర్ సీఐ సైదారావ్ సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సోమవారం డీజే నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలతో డీజేలపై నిషేధం విధించామని, అనుమతి లేకుండా డీజేలను వినియోగిస్తే చర్యలు తప్పవన్నారు. ఎస్సై శంకర్, తదితరులు పాల్గొన్నారు.


కొనసాగుతున్న తీజ్ ఉత్సవాలు



బిందెలతో నీటిని తీసుకువస్తున్న విద్యార్థినులు

కుంటాల: మండలంలోని అంబకంటి తండాలో తీజ్ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం నాలుగో రోజు యువతులు, విద్యార్థినులు పాటలు పాడుతూ స్థానిక చెరువు నుంచి బిందెలతో నీటిని తెచ్చారు. గోధుమల నారుకు నీళ్లు పోసి పూజలు చేశారు. తండా పెద్దలు పాల్గొన్నారు.

పెద్దమ్మ ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి మొక్కు చెల్లించుకున్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు.

ఆలయ చైర్మన్‌కు సన్మానం



శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, తదితరులు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బంగాల్‌పేట్ మహాలక్ష్మి ఆలయ నూతన చైర్మన్‌గా నియమితులైన కొడకల శ్రీకాంత్‌ను మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ ఈశ్వర్ సన్మానించారు. అనంతరం మహాలక్ష్మి ఆలయం వద్ద జరిగే దసరా ఉత్సవాల ఏర్పాట్లపై చర్చించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ రాజు, కాలనీవాసులు శ్రీను, అనిల్, రాహుల్, సంతోష్ ఉన్నారు.

పూల ధరలకు రెక్కలు

- దేవీనవరాత్రులు, బతుకమ్మ పండుగ నేపథ్యంలో రెట్టింపు
- వివిధ పూలకు పెరిగిన డిమాండ్



జిల్లాకేంద్రంలో పూలు కొనుగోలు చేస్తున్న జనం

నిర్మల్‌ఖిల్లా: ప్రస్తుతం దుర్గాదేవి నవరాత్రులు, మరోవైపు బతుకమ్మ వేడుకలు కొనసాగుతున్నాయి. జిల్లాకేంద్రంలోని మార్కెట్‌లో పూల ధరలకు రెక్కలు వచ్చాయి. ఏటా పండుగ రోజుల్లో వీటి ధరలు సాధారణ రోజుల కంటే ఎక్కువగానే ఉంటున్నాయి. గతంలో కన్నా ఈసారి పూలధరలు రెట్టింపయ్యాయి. జిల్లాలో పూలసాగు తక్కువగానే ఉండడంతో ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు వీటిని దిగుమతి చేసుకుంటున్నారు. నిర్మల్ మార్కెట్‌లో చామంతి, గులాబీ, తెల్లచామంతి, బంతి, మల్లె, సీతజడ తదితర పూలను విక్రయిస్తున్నారు. చామంతి గతేడాది కిలో రూ.200 ఉండగా ప్రస్తుతం 400 పైగా పలుకుతోంది. గులాబీ పూలు గతేడాది రూ.150 ఉండగా ప్రస్తుతం రూ.350 పైగానే ఉంది. తెల్ల చామంతి దాదాపు రూ.300 పై ధర పలుకుతోంది. బంతిపూలు గతంలో రూ.60 ఉండగా ప్రస్తుతం రూ.180లకు చేరింది. ఇక మల్లె పూలు కిలో రూ.600 ధర పలుకుతుండటం గమనార్హం. ఇలా ధరలు గణనీయంగా పెరగడంతో పండుగ వేళ కొనుగోలుదారులు కాస్త ఆచితూచి కొనాల్సిన పరిస్థితి. జిల్లావ్యాప్తంగా దాదాపు 200 మంది పైగా పూల వ్యాపారులు ఉన్నారు.

పూల వినియోగం ఎక్కువే..

దసరా నవరాత్రులు సందర్భంగా అమ్మవారి అలంకరణకు, బతుకమ్మలను పేర్చడానికి వివిధ రకాల పూలను వినియోగిస్తున్నారు. మహిళలు, యువతులు అధిక ధరలకు పూలను కొనుగోలు చేస్తున్నారు. పూలకు డిమాండ్ ఏర్పడింది. జిల్లాలో పూల పెంపకం, సాగు అంతగా లేకపోవడంతో స్థానిక వ్యాపారులు హైదరాబాద్, బెంగళూరు, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో రవాణా ఖర్చులు తడిసి మోపడువుతున్నట్లు చెబుతున్నారు. అందువల్ల టోకున కొనుగోలు చేసే పూలకు ఎక్కువ మొత్తంలో వెచ్చించాల్సి వస్తోంది. రిటైల్‌గా అమ్మే పూలపై దీన్ని ప్రభావం పడుతుందని వ్యాపారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

డిమాండ్ ఉన్నా లాభాలు తక్కువే



దేవీ నవరాత్రులు, బతుకమ్మ పండుగకు పూలకు డిమాండ్ ఉంది. టోకున కొనుగోలు చేసేచోట వీటి ధరలు ఎక్కువగానే పలుకుతున్నాయి. ధరల ప్రభావం వల్ల లాభాలు తక్కువగానే ఉంటున్నాయి. రిటైల్ ధరలు పెరిగినా రవాణా, కూలీల ఖర్చులు ఇతరత్రా పోను అంతగా గిట్టుబాటు కావడం లేదు. దీనికి తోడు మాలలుగా పేర్చడం, పనివాళ్ల వేతనాలకు పోను మిగిలేది అంతంతగానే ఉంది.

– నరేశ్, పూల వ్యాపారి, నిర్మల్

భైంసాలో ముస్లింల స్వచ్ఛంద బంద్

భైంసాటౌన్: మహ్మద్ ప్రవక్తపై ఓ వ్యక్తి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ పట్టణంలో ముస్లింలు సోమవారం స్వచ్ఛంద బంద్ పాటించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఎవరికివారు స్వచ్ఛందంగా దుకాణాలు మూసి ఉంచి నిరసన తెలిపారు. అలాగే భైంసా మున్సిపల్ వైస్‌చైర్మన్ జాబీర్ అహ్మద్ ఈ సందర్భంగా ఓ వీడియో సందేశం విడుదల చేశారు. సామాజిక మాధ్యమాల్లో భైంసా బంద్ పాటించాలని, ర్యాలీ తీయనున్నట్లు పోస్టులు వచ్చిన నేపథ్యంలో ఆయన స్పందిస్తూ మాట్లాడారు. సదరు వ్యక్తి ఇప్పటికే అరెస్టయ్యారని, ఈ మేరకు ఎంఐఎం ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. పట్టణంలో శాంతియుత వాతావరణానికి భంగం కలిగించేలా ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు తెలుపవద్దని ఆయన సూచించారు.

ముధోల్‌లో..

ముధోల్: మహ్మద్ ప్రవక్తపై ఓ వ్యక్తి చేసిన అనుచిత వ్యాఖ్యలను సోమవారం ముస్లింలు ఖండించారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మండల కేంద్రంలో ఎస్సై, తహసీల్దార్‌లకు వినతిపత్రం అందజేశారు.

నిరంతరం నీటిని సరఫరా చేయాలి



లోకేశ్వరం: మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

లోకేశ్వరం: గ్రామాల్లో నిరంతరంగా మంచినీటిని సరఫరా చేయాలని భైంసా మిషన్ భగీరథ డీఈ లక్ష్మీనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మంచినీటి సహాయకుల శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైప్‌లైన్ లీకేజీలు, వాట్ పనిచేయకపోవడం, విద్యుత్ మోటారు రిపేర్, ట్యాంకు శుభ్రత, నీరు వృథా అరికట్టడంపై శిక్షణ ఇస్తామన్నారు. నాలుగు రోజుల శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. వాటర్ గ్రిడ్ ఏఈ సుమన్, ఎంపీడీవో వెంకటరమేశ్, ఎంపీఈవో సోలమాన్‌రాజ్ ఉన్నారు.

మంచినీటి సహాయకులకు శిక్షణ

ఖానాపూర్: ఎంపీడీవో కార్యాలయ సమావేశమందిరంలో సోమవారం గ్రామ మంచినీటి సహాయకులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సునీత మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్యలు తలెత్తినప్పుడు పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలు, తాగునీరు కలుషితం కాకుండా చేపట్టాల్సిన జాగ్రత్తలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హరీశ్, ఎంపీవో రత్నాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ నియోజకవర్గానికి చెందిన 162 మంది లబ్ధిదారులకు రూ.41,58,500 విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. జిల్లాకేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సోమవారం చెక్కులు పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరిస్తాం

సాక్షి స్పందన



బెంబరకాలనీలో మిషన్ భగీరథ నీటి ట్యాంక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

తానూరు: మండలంలోని బెంబర గ్రామంలోని కాలనీలో తాగునీటి ఇబ్బందులపై 'నీటికష్టాలు తీరేదెన్నడు' శీర్షికన సాక్షిలో సోమవారం కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన మిషన్ భగీరథ ఏఈ శ్రీమాన్, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ పృథ్వీ, ఎంపీవో నసీరొద్దీన్.. బెంబర కాలనీలో పర్యటించారు. మిషన్ భగీరథ నీటి ట్యాంక్‌ను పరిశీలించారు. కాలనీవాసులతో మాట్లాడారు. ట్యాంక్‌కు నీరు సరఫరా అవుతున్న కుళాయిల్లో రావడం లేదని అధికారుల దృష్టికి తెచ్చారు. గ్రామంలోని కాలనీలో అంతర్గతంగా ఉన్న పైప్‌లైన్‌కు మరమ్మతు చేపట్టి నీరు సరఫరా చేసి సమస్య పరిష్కరిస్తామని హామీచ్చారు. పంచాయతీ కార్యదర్శి వినయ్‌కుమార్, సూపర్‌వైజర్ ఆనంద్, సిబ్బంది యోగేశ్ తదితరులు ఉన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి



ఓటు నమోదుపై అవగాహన కల్పిస్తున్న, నాయకులు

భైంసారూరల్: డిగ్రీలు పూర్తిచేసుకున్న పట్టభద్రులు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వాటోలి గ్రామంలో సోమవారం పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు నమోదు చేపట్టారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అంజికుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆదేశాలతో ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక లక్షల ఉద్యోగాలు ప్రకటిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని తెలిపారు. జాబ్ క్యాలెండర్ విడుదల, నిరుద్యోగ భృతి ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. నాయకులు ఆకాశ్, సచిన్, గంగాధర్ అడ్వకేట్, గణేశ్, జగత్‌పటేల్, సాయినాథ్, దత్తుపటేల్, రవి, రమేశ్‌పటేల్, నాగేశ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సన్మానం

కుభీర్: మండల కేంద్రానికి చెందిన జె.బాలాజీ యాదవ్ యోగా మాస్టారు, పోలీసు ఉద్యోగంలో ఇటీవల హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి వచ్చింది. సోమవారం ఆయన బాల్యమిత్రులు నిర్మల్‌లోని ఆయన నివాసంలో సన్మానించారు. కుభీర్ మాజీ సర్పంచ్ కె.అరవింద్, భైంసా మున్సిపాలిటీ కౌన్సిలర్ గాలి రవి, భైంసా మండల పీఆర్టీయూ అధ్యక్షుడు ఎస్.గంగాధర్, ఉపాధ్యాయులు టి.గంగాధర్, బీఎస్ఎన్ఎల్ బోర్డు సభ్యుడు గంగాశేఖర్, బీజేపీ నాయకుడు వెంకటస్వామి ఉన్నారు.

సద్దుమణిగిన వివాదం

ముధోల్: మండలంలోని బోరిగాం గ్రామంలో ఓ స్థలం విషయంలో ఇరువర్గాల మధ్య సోమవారం వివాదం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై సాయికిరణ్, లోకేశ్వరం ఎస్సై అశోక్, బాసర ఎస్సై గణేశ్‌లు సంఘటన స్థలానికి చేరుకున్నారు. గ్రామపెద్దలు, ఇరువర్గాలను పిలిపించి సముదాయించారు. దీంతో వివాదం సద్దుమణిగింది. పండుగ తర్వాత ఇరువర్గాల పెద్దలతో సమస్యను పరిష్కరించుకుంటామని గ్రామస్తులు తెలిపారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

కుభీర్: మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో మంగళవారం విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు డీఈ శ్రీనావాస్‌రెడ్డి, ఏఈ అజిజొద్దీన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే వేదికలో గ్రామస్తులు హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

నేడు ప్రజావేదిక

ముధోల్: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధిహామీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శివకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 2023–24 సంవత్సరంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ 19 పంచాయతీల వివరాలను పొందిపర్చి అభివృద్ధిపై ప్రజావేదికలో వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే రామరావు పాటిల్, ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.

నగదు విరాళం

లోకేశ్వరం: మండలంలోని బిలోలి గ్రామానికి చెందిన ఆత్మ మాజీ చైర్మన్ రవీందర్‌రావు కుమార్తె శిరీష పుట్టినరోజు సందర్భంగా భైంసా వివేకానంద ఆవాసానికి రూ.3100 నగదును అందజేశారు. ఆవాసంలోని పిల్లల మధ్య కేక్ కట్‌చేసింది. బీజేపీ నాయకులు రమేష్,రాజేష్‌బాబు,రజక్‌లు ఉన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన

ఖానాపూర్: ఖానాపూర్ అటవీ రేంజ్ పరిధిలోని పెంబి మండలం నాగాపూర్‌లో సోమవారం వన్యప్రాణుల సంరక్షణపై అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. వన్యప్రాణి సప్త వారోత్సవాల్లో భాగంగా ఎఫ్ఆర్వో కిరణ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో ప్రొజెక్టర్ ఏర్పాటుచేసి అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామస్తులు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

శివగంగా మందిరం ప్రారంభం

కుభీర్: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శివగంగా మందిరాన్ని సోమవారం ప్రారంభించారు. అందులో విగ్రహాలను ప్రతిష్ఠించారు. గ్రామానికి చెందిన ఎడ్ల మల్లన్న దంపతులు తమ సొంత డబ్బులతో నిర్మించారు. విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కాలనీవాసులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ఖానాపూర్: పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలోని ఓ నూతన భవనం వద్ద మృతి చెంది ఉన్న అనాథ శవానికి సోమవారం రాత్రి అంత్యక్రియలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం చొరవతో అధికారుల సమక్షంలో మృతదేహాన్ని ముస్లిం సోదరులకు అప్పగించి దగ్గరుండి అంత్యక్రియలు జరిపించారు. ఏఎస్సై రాంచందర్, మైనార్టీలు ముషీర్, షౌకత్‌పాషా, సజత్‌అలీ, ఆమేర్, సాధర్, కైసర్, మొహినొద్దిన్, జియా తదితరులు ఉన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి

లోకేశ్వరం: బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని పార్టీ ముధోల్ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ సుమన్‌కుమార్ అన్నారు. మండలంలోని గడ్‌చాంద, పిప్రి, పంచగుడి, దర్మోర, గొడిసెరా, రాయాపూర్‌కాండ్లీ తదితర గ్రామాల్లో సోమవారం బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. అనంతరం బీజేపీ కార్యకర్తలు, నాయకులు పట్టభద్రులతో ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎన్నికల కోసం ఓటరు నమోదు చేయించారు. నాయకులు నల్ల రమేశ్, లక్ష్మణ్‌రావు, మంద గణేశ్, గంగాధర్, జీవన్, సందీప్, సాయినాథ్ పటేల్, శ్రీకాంత్ ఉన్నారు.

వైభవంగా నవరాత్రోత్సవాలు



సోన్ మండలం కూచన్‌పెల్లిలో దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు



లక్ష్మణచాంద: పార్‌పెల్లిలో శివ పార్వతుల కల్యాణంలో పాల్గొన్న భక్తులు



భైంసాటౌన్: గణేశ్‌నగర్‌లో మండపం వద్ద చిన్నారుల ప్రదర్శన

భైంసాటౌన్: పట్టణంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆయా మండపాల్లో కొలువుదీరిన అమ్మవారికి ఉదయం, సాయంత్రం వేళల్లో మహిళలు, యువతులు, భక్తులు పూజలు చేశారు. ఆదివారం రాత్రి గణేశ్‌నగర్‌లో శ్రీరామచైతన్య యూత్ వద్ద చిన్నారులు నృత్య ప్రదర్శన నిర్వహించగా, గుజరాతీ సమాజ్ ఆధ్వర్యంలో సంప్రదాయ గర్బా దాండియా నృత్య ప్రదర్శన నిర్వహించారు. దుర్గామాత హారతిలో ఏఎస్పీ అవినాష్‌కుమార్ పాల్గొని పూజలు చేశారు. ఏఎస్పీ మాట్లాడుతూ పండుగలు మన సంస్కృతిలో భాగమన్నారు. అనంతరం గుజిరిగల్లి శ్రీ సరస్వతి శిశుమందిర్ విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించగా, చూపరులను అలరించాయి. పట్టణ సీఐ గోపీనాథ్, సభ్యులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని పలు దుర్గామాత మండపాల్లో సోమవారం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.మహిళలు పాల్గొని పూజలు చేశారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమాన్ని చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, కాంగ్రెస్ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్ నివాసంలో ఏర్పాటుచేసిన దుర్గామాత వద్ద పూజలు చేశారు. జేకేనగర్‌లోని మండపం వద్ద జరిగిన పూజలో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం పాల్గొన్నారు. ఖానాపూర్‌లోని శివాజీనగర్ కాలనీలోని మహాలక్ష్మి ఆలయంలో దుర్గామాత మండపం ఎదుట మహిళలు అమ్మవారి ఆకారంలో సామూహిక దీపారాధన నిర్వహించారు.

ముధోల్: మండల కేంద్రంలోని మహాలక్ష్మి గల్లీలో శ్రీసర్వశక్తి దుర్గామాత వద్ద సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. సుమారు 50 మంది మహిళలు పాల్గొన్నారు. పండితుడు ప్రణీత్‌మహారాజ్ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణల మధ్య జరిగింది.

లక్ష్మణచాంద: పార్‌పెల్లిలో దుర్గామాత సన్నిధిలో సోమవారం శివ పార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. దుర్గామాత ఉత్సవకమిటీ నిర్వాహకులు, తాజా మాజీ సర్పంచ్ రాజేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే మల్లాపూర్, పార్‌పెల్లి గ్రామాల్లో దుర్గామాత వద్ద అన్నదానం చేపట్టారు.

సారంగాపూర్: మండలంలోని జామ్ గ్రామానికి చెందిన దుర్గామాత మాలధారులు సోమవారం 12 కి.మీ పాదయాత్రగా నిర్మల్‌లోని నందిగుండం దుర్గామాత ఆలయానికి తరలివెళ్లారు. ఈసందర్భంగా అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు.

కడెం: లింగాపూర్‌లో ప్రతిష్ఠించిన దుర్గామాత మండపం వద్ద యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి సోమవారం పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి శాలువతో సత్కరించారు.

కుంటాల: దుర్గామాత వద్ద జరిగిన కుంకుమార్చనలో మహిళలు పాల్గొన్నారు. కల్లూరు, అందాకూర్ గ్రామాల్లో అన్నదానం ఏర్పాటు చేశారు.

సోన్: కూచన్‌పెల్లిలో సోమవారం ఐదో రోజు అమ్మవారు మహాచండీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. దుర్గామాత ఉత్సవ సమితి ఆధ్వర్యంలో అమ్మవారికి 108 ప్రసాదాలతో నైవేద్యం సమర్పించారు. సభ్యులు రామకృష్ణ, శ్రీనివాస్, విజయ్, గణేశ్ పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాలు



తానూరు మండలం భోసిలో..



కుంటాల: లింబా(బి)లో



భైంసారూరల్: తిమ్మాపూర్‌లో

తానూరు/భైంసారూరల్/కుంటాల: తానూరు, భైంసారూరల్, కుంటాల మండలంలోని గ్రామాల్లో సోమవారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. మహిళలు, యువతులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా సంఘం మహిళలు, విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి అందులో గౌరమ్మ పెట్టి పూజలుచేశారు. అందరూ ఒకే చోట చేరి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాల్లో పాడి, కోలాటాలతో నృత్యం చేశారు. అనంతరం చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన వారికి సన్మానం

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన నలుగురు విద్యార్థులు ఇటీవల ఎంబీబీఎస్‌లో సీటు సాధించినందుకు గాను విద్యానగర్ దుర్గామాత మండలి అధ్యక్షుడు పరంకుశం శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. కాలనీకి చెందిన విష్ణు, సౌమ్య, వర్షిణి, సాయిశృతికి పూలమాల వేసి సత్కరించారు. ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్న ప్రజ్ఞను సన్మానించి అభినందనలు తెలిపారు. శివాజీనగర్ కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు దాసరి రాజన్న కుమార్తె సాయిశృతి ఎంబీబీఎస్‌లో ప్రవేశం పొందింది. ఆమెను మాలమహానాడు ఆధ్వర్యంలో సన్మానించారు.

కుభీర్: కుభీర్‌కు చెందిన వైభవ్ ఎంబీబీఎస్‌లో ప్రవేశం లభించింది. మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఉచిత సీటు వచ్చింది. వైభవ్‌కు ఎంబీబీఎస్‌లో సీటు రావడం పట్ల తల్లిదండ్రులు మనీశా శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన

నిర్మల్‌చైన్‌గేట్:ఇజ్రాయెల్, పాలస్తీనా యుద్ధం ఆపాలని పశ్చిమాసియాలో శాంతి నెలకొల్పాలని వామపక్ష పార్టీల నాయకులు కోరారు. జాతీయ నాయకత్వం పిలుపు మేర కు ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్ మాట్లాడుతూ దాదాపు ఏడాదిగా కొనసాగుతున్న ఇజ్రాయెల్ పాలస్తీనా యుద్ధాన్ని ఆపాల్సిన అమెరికా అగ్నికిఆజ్యం పోస్తోందని విమర్శించారు. యుద్ధంతో రెండు దేశాలు నష్టపోతున్నాయని తెలిపా రు. ప్రధాని మోదీ కల్పించుకుని ఇరుదేశాల సమస్యలు పరిష్కరించాలన్నారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్.రాజు మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదం నశించాలన్నారు. ఇజ్రాయెల్ యుద్ధాన్ని క్రమంగా విస్తరిస్తోందని తెలిపా రు. నిరసనలో ఎల్.ఆర్.ఉపాలి, ఎస్.ఎన్. రెడ్డి, భూక్యా రమేశ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు దుర్గే అనంతరావు, డి.పోశెట్టి, ఎస్.గంగన్న, ఎం.బక్కన్న పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామానికి చెందిన ముస్కం ఎర్రన్న అదృశ్యంతో భార్య ఫిర్యాదుతో సోమవారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఎర్రన్న గతనెల 30న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అతని ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు చుట్టూపక్కల వెతికినా దొరకలేదు. భార్య భోజవ్వ ఫిర్యాదుతో మిస్సింగ్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

'ప్రైవేట్ ఆస్పత్రిపై చర్యల్లేవ్'

ఖానాపూర్: నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రిపై సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బీఎస్పీ నియోజకవర్గ కన్వీనర్ కుక్కరికారి రాజేష్, నాయకుడు అభిషేక్ యాదవ్ ప్రశ్నించారు. జిల్లాకేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని వివేకానంద చౌరస్తాలో గల ప్రైవేట్ ఆస్పత్రిలో అర్హత లేని వైద్యులతోపాటు అనుమతి లేకుండా ఆస్పత్రి నిర్వహిస్తున్నారని తెలిపారు. వైద్యశాఖ జిల్లా అధికారులే పత్రికా ప్రకటన చేసినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఆస్పత్రి యాజమాన్యంతోపాటు బాధ్యులపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని లేకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.